క్లుప్తంగా

ప్రతి గురువారం డయల్ యువర్ మున్సిపల్ కమిషనర్

అమలాపురం టౌన్: ఇక నుంచి ప్రతి గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకూ ఓ గంట సమయంపాటు డయల్ యువర్ మున్సిపల్ కమిషనర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వి.నిర్మల్ కుమార్ తెలిపారు. పట్టణ ప్రజలు తమ పరిసరాల సమస్యలను సెల్ 9849905805 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన సూచించారు.

అమలాపురం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా దివాకర్

అమలాపురం రూరల్: అమలాపురం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వీఎస్ దివాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు అమలాపురం తహసీల్దార్‌గా పనిచేసిన పలివెల అశోక్ ప్రసాద్ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఉప్పలగుప్తం తహసీల్దార్‌గా పని చేస్తున్న దివాకర్‌కు ఎఫ్ఏసీ హోదాలో అమలాపురం తహసీల్దార్ బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తహసీల్దార్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

హోటళ్లలో తనిఖీ

అమలాపురం టౌన్: స్థానిక హోటళ్లపై రెండో రోజు శుక్రవారం కూడా ఆకస్మిక దాడులు, తనిఖీలు కొనసాగాయి. ఇటీవల కాలంలో పట్టణంలోని పలు హోటళ్ల ఆహార పదార్థాల నాణ్యతపై ఆరోపణలు చోటు చేసుకోవడం, అవి సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో అధికారులు దాడులు చేస్తున్నారు. పట్టణంలో గురువారం రెండు మాంసాహార హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారి వై.రామయ్య, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌లు తమ శాఖల సిబ్బందితో మాత్రమే దాడులు చేస్తే, రెండో రోజు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నందాజీ రావడం గమనార్హం. స్థానిక గణపతి ఫుడ్ హౌస్, బొండం బాబాయి హోటళ్లను ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. ఈ హోటళ్లలో కొన్ని ఆహార పదార్థాలపై అనుమానం వచ్చి, శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌లకు పంపించారు. అలాగే రెండు హోటళ్లకు నోటీసులు జారీ చేశారు. ల్యాబ్‌కు పంపించిన శాంపిల్స్‌లో తాము అనుమానించినట్లు అపరిశుభ్రత, నిల్వ తదితర కారణాలు వెలుగు చూస్తే ఆ హోటళ్లపై చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నందాజీ తెలిపారు. ఈ దాడుల్లో మున్సిపల్ ఏఈ వెంకటేష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, మేస్త్రీలు, వార్డు సచివాలయాల శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

ఐ.పోలవరం: తమ న్యాయమైన కోర్కెలను తీర్చాలని డిమాండ్ చేస్తూ పీహెచ్‌సీ వైద్యాధికారులు చేపట్టిన సమ్మెకు పీహెచ్‌సీ సిబ్బంది మద్దతు తెలిపారు. స్థానిక కేశనకుర్రు పీహెచ్‌సీ వద్ద శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సెప్టెంబరు 26 నుంచి పీహెచ్‌సీ వైద్యాధికారులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్యుల సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

లింగ అసమానతలు తొలగించాలి

తాళ్లరేవు: సమాజంలో లింగ అసమానతలు తొలగించడమే బాలికా దినోత్సవం ముఖ్య ఉద్దేశమని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారి విజయ అన్నారు. శుక్రవారం స్థానిక నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్తంగా బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ ప్రతీయేటా అక్టోబరు 11 బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సోషల్ వర్కర్ చినబాబు, ఐసీడీఎస్ ఇంఛార్జ్ ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి, సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ ప్లాంట్ స్థల పరిశీలన

అమలాపురం టౌన్: మున్సిపాలిటీల్లో సూర్యఘర్ కేంద్ర ప్రభుత్వ పథకంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ల స్థాపన ద్వారా విద్యుత్ చార్జీలను గణనీయంగా తగ్గించడం ద్వారా స్థానిక సంస్థలు ఆర్థికంగా బలపడతాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. అమలాపురం మున్సిపాలిటీకి చెందిన నడిపూడి సమ్మర్ స్టోరేజ్ చెరువు వద్ద ప్రతిపాదిత సోలార్ ప్లాంట్ స్థలాన్ని కలెక్టర్ మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్, ఈపీడీసీఎల్ ఎస్ఈ బి.రాజేశ్వరి పాల్గొన్నారు.

ఉపాధి పథకం పనుల పరిశీలన

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో జిల్లాలో పర్యటించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కేంద్ర బృందం ఎంపీ గంటి హరీష్ మాథుర్‌ను కలిసింది. స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో బృంద ప్రతినిధులు శుక్రవా రం సమావేశమై జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలుతీరుపై చర్చించారు. జిల్లాలో అయిదు రోజులపాటు పర్యటించిన ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం ప్రతినిధులు ఉమేష్ కుమార్‌రామ్, మయూర్‌వర్మ జిల్లాలోని పలు ఉపాధి హామీ పనులను, కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన రోడ్లను పరిశీలించారు. జిల్లా డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.రాంబాబు, పంచాయతీరాజ్ డీఈఈ అన్యం రాంబాబు ఉన్నారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి రాజ్యాంగ విరుద్ధం

- అమలాపురం, ముమ్మిడివరంలో జర్నలిస్టుల నిరసన
- 'సాక్షి' ఎడిటర్‌పై తప్పుడు కేసులు ఉపసంహరించుకోవాలి



అమలాపురం రూరల్: చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం 'సాక్షి' మీడియాపై చేస్తున్న కుట్రలను, వేధింపులను ఖండిస్తూ పాత్రికేయులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 'సాక్షి' టీవీ ప్రసారాలను నిలిపివేయడం, 'సాక్షి' యాజమాన్యం, ఎడిటర్ ధనంజయరెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేయడం పత్రికా స్వేచ్ఛను కాలరాయడమేనంటూ నినదించారు. అనంతరం 'సాక్షి' యాజమాన్యంపై కక్ష సాధింపు చర్యలను విడనాడాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

కలెక్టరేట్ వద్ద నిరసన

'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డి, జర్నలిస్టులపై కూటమి ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసులు ఉపసంహరించుకోవాలని కోరుతూ అమలాపురం కలెక్టరేట్ వద్ద శుక్రవారం అమలాపురం నియోజకవర్గం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ప్రజాసంఘాలు నాయకులు, ఏపీయూడబ్ల్యూజే నాయకులు నిరసన తెలిపారు. హైదరాబాదు, నెల్లూరు 'సాక్షి' కార్యాలయాల్లో పోలీసులు సోదాలు, సిబ్బందికి నోటీసులు ఇవ్వడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులకు రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కోరుతూ కలెక్టరేట్ ఏవో కే కాశీవిశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే అమలాపురం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శి అరిగెల రుద్ర శ్రీనివాసరావు, దొమ్మేటి వెంకట్, పాత్రికేయులు మాకే శ్రీనివాసరావు, పొట్టుపోతు నాగు, రమేష్, ఉండ్రు ప్రసాద్, విజయ్, కనబోయిన దుర్గాప్రసాద్, సురేష్, అబ్బాస్, నల్లా విజయ్, కట్టా మురళి కృష్ణ, అద్దింకి భాస్కర్, రత్నం, త్రిమూర్తులు, ఆసు భరత్, మామిడి శెట్టి విష్ణుప్రసాద్, కూడుపూడి ప్రసాద్ పాల్గొన్నారు.


ముమ్మిడివరంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు


అమలాపురం కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న పాత్రికేయులు, ప్రజా సంఘాల నాయకులు

'సాక్షి'పై వేధింపులు తగవు

ముమ్మిడివరం: ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ముమ్మిడివరం నియోజకవర్గ పాత్రికేయులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం 'సాక్షి'పై వేధింపులు తగవని నిరసన తెలిపారు. 'సాక్షి' మీడియాపై కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును వారు ఖండించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు గొర్రెల ధనంజయరావు, డీవీ సుబ్బారావు, పి.సత్యనారాయణ, మట్టపర్తి సురేష్, పోలిశెట్టి ప్రకాష్, కొప్పిశెట్టి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుల నిరసన

ఐ.పోలవరం: కూటమి ప్రభుత్వం 'సాక్షి' మీడియా సంస్థలపై కక్ష కట్టి మరీ వేధింపులకు గురి చేయడం ప్రజాస్వామ్యానికి చేటు అని వైఎస్సార్ సీపీ నాయకులు తాళ్లూరి ప్రసాద్, మచ్చా నగబాబు, నాతి నాగేశ్వరరావు శుక్రవారం అన్నారు. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డికి నోటీసులు ఇస్తూ వేధించడం తక్షణం ఆపాలని వారు డిమాండ్ చేశారు.

వైద్య విద్య ప్రైవేటీకరణపై కోటి సంతకాలతో నిరసన

అల్లవరం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాలు, పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించాలన్న సంకల్పంతో 17 వైద్య కళాశాలలను ఏర్పాటు చేశారని, వాటిలో ఏడు కళాశాలలను పూర్తి చేస్తే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ వాటన్నింటినీ ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నిస్తోందని వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ అధ్యక్షతన తాడికోన, గూడాల గ్రామాల్లో శుక్రవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు కోఆర్డినేటర్ శ్రీకాంత్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, సీఈసీ సభ్యులు చింతా అనురాధ హాజరయ్యారు. వైద్య కళాశాలలను ప్రైవేటుపరం కాకుండా ఆపే శక్తి ప్రజలకు ఉందని శ్రీకాంత్ అన్నారు. వైద్య కళాశాలలపై కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రను అడ్డుకునేందుకు కోటి సంతకాలతో రాష్ట్ర గవర్నర్‌కు వినతి పత్రాన్ని అందించాలన్నారు. నవంబర్ 22న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర గవర్నర్‌ను కలిసి కోటి సంతకాల వినతిపత్రాన్ని సమర్పిస్తారని తెలిపారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ 17 మెడికల్ కాలేజీల్లో ఏడు కాలేజీ నిర్మాణాలు పూర్తికావడంతో ఇప్పటికే వైద్య విద్యను అందిస్తున్నారని తెలిపారు. మరో పది కాలేజీ భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. వాటిని పూర్తి చేయడానికి రూ.5 వేల కోట్ల నిధులు అవసరం కాగా కూటమి ప్రభుత్వం వాటిని ఇవ్వకుండా వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వైద్యం పేద ప్రజలకు అందకుండా చేయడమేనని తెలిపారు. సీఈసీ సభ్యులు, మాజీ ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడంతో కార్పొరేట్ సంస్థలు పేద ప్రజలను దోపిడీ చేస్తాయని తెలిపారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పూర్తి చేసి కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం పీపీపీ విధానంలోని వైద్య కళాశాలలకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, కూడుపూడి భరత్‌భూషణ్, వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతా రామకృష్ణ, సర్పంచ్‌లు రాకాపు విజయలక్ష్మి, బడ్రే సీతారత్నం, ఎంపీటీసీ మాకే కృష్ణమూర్తి, పులుసుగంటి రాజేశ్వరి, పార్టీ నాయకులు నాతి శ్రీనివాసరావు, ఉండ్రు బాబ్జి, తిక్కా ప్రసాదు, పరమట శ్రీను, దాసరి బాలస్వామి, శిరంగు వీరబాబు,నాగరాజు, ముత్తాబత్తుల సంతోష్, మట్టపర్తి సత్తిబాబు పాల్గొన్నారు.


వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేసిన కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, సీఈసీ సభ్యులు అనురాధ తదితరులు

అమలాపురంలో నేడు సంతకాల సేకరణ

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం 13 నుంచి 16వ వార్డులకు సంబంధించి వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్థానిక వాసర్ల గార్డెన్స్‌లో రచ్చబండ, సంతకాల సేకరణ కార్యక్రమాలు శనివారం సాయంత్రం 3 గంటలకు నిర్వహించనున్నట్టు పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని తెలిపారు. నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని బులినాని పిలుపునిచ్చారు.

పేద విద్యార్థుల కలలను చిదిమేస్తున్న చంద్రబాబు

ఉప్పలగుప్తం: భవిష్యత్తులో డాక్టర్ అవ్వాలన్న పేద విద్యార్థుల కలలను ముఖ్యమంత్రి చంద్రబాబు పీపీపీ విధానంతో చిదిమేస్తున్నారని అమలాపురం నియోజకవర్గం కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. ఎస్.కొత్తపల్లిలో మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి ఆయన రచ్చబండ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ప్రతి గ్రామంలో సంతకాలు సేకరించి ప్రభుత్వ వైద్య కళాశాలలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సందపరావు, వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యురాలు చింతాఅనురాధ, అమలాపురం నియోజకవర్గం పరిశీలకులు కర్రి పాపారాయుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి రామారావు, ఆయా విభాగాల జిల్లా అధ్యక్షులు జిన్నూరి వెంకటేశ్వరరావు, తోరం గౌతమ్‌రాజా, ఆయా విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు గెడ్డం కిరణ్, నల్లా సూర్యప్రకాష్, మండల అధ్యక్షులు పోతుమూడి కొండబాబు, యనమదల పల్లంరాజు, ఓగూరి విజయ్ కుమార్, పార్టీ నాయకులు బొడ్డు నాగేశ్వరరావు, కుంచే చిన్నీ, లంకే సూరిబాబు, నడింపల్లి వాసురాజు, అంగాని సాంబశివరావు, కొంకి బాలకృష్ణ, కొంకి రాంబాబు, సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, జొన్నాడ శ్రీదుర్గ, ఎంపీటీసీ సభ్యులు కొంకి ఏడుకొండలు పాల్గొన్నారు.


ఎస్.కొత్తపల్లిలో రచ్చబండ సమావేశంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న శ్రీకాంత్

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు


బండారులంకలో రిలే దీక్ష చేస్తున్న గ్రామస్తులు

అమలాపురం రూరల్: బండారులంకలో చెత్తను తరలించాలని వైఎస్సార్ సీపీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం మూడో రోజుకు చేరాయి. రిలే నిరాహార దీక్షల్లో పంచాయతీ రెండవ వార్డు మెంబర్ పులిదిండి శారద ఆధ్వర్యంలో వార్డు ప్రజలు సరెళ్ల రామకృష్ణ, బొంతు కృష్ణమూర్తి, మెల్లం శ్రీను, రేవు శ్రీను, గోసంగి శ్రీను, సరెళ్ల సత్యనారాయణ, సరెళ్ల ఏడుకొండలు, నేల సత్యనారాయణ దీక్షలో పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ వూటుకూరు సుబ్రహ్మణ్యంస్వామి, పేరూరు ఎంపీటీసీ సభ్యులు వాసంశెట్టి శ్రీనివాసరావు, దొంగ అంజిబాబు, అంకం హిమ భారతి, నాయకులు దంగేటి రుద్ర,దంగేటి సింహాచలం, దంగేటి వెంకట శెట్టి,గుత్తుల సురేష్,దంగేటి బాబ్జి, దాసరి డేవిడ్, దంగేటి శ్రీను, వాసా దొరబాబు, ఇనుమర్తి లింగమూర్తి ,అంకం పెదరాజు, కుర్మా క్రీస్తు బాబు,పెదపూడి బాబురావు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

శంకరనారాయణకు డిప్యూటీ ఎంపీడీఓగా పదోన్నతి

తాళ్లరేవు: గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న నున్న శంకరనారాయణకు డిప్యూటీ ఎంపీడీఓగా పదోన్నతి లభించింది. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన పదోన్నతుల్లో ఆయనకు కాట్రేనికోన మండల అదనపు అభివృద్ధి అధికారిగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయన తాళ్లరేవు నుంచి కాట్రేనికోనకు బదిలీపై వెళ్లనున్నారు. పదోన్నతి సాధించిన శంకరనారాయణను తాళ్లరేవు సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి, స్థానిక నాయకులు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది అభినందించారు.

జిల్లాస్థాయి యోగా పోటీలకు ఎంపిక

అమలాపురం టౌన్: శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమం ఆధ్వర్యంలో స్థానిక విద్యానిధి పాఠశాలలో విద్యార్థులకు యోగా పోటీలు శుక్రవారం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన దాదాపు 80 విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. స్వామి వివేకానంద యోగాశ్రమ యోగా గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ పర్యవేక్షించారు. మొత్తం 8 విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారు రావులపాలెం సీఆర్సీలో నిర్వహించనున్న జిల్లాస్థాయి యోగా పోటీల్లో పాల్గొననున్నారు. విజేతలకు ధ్రువీకరణ పత్రాలు, పతకాలు అందించారు. విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఆకుల బాపన్నాయుడు, ప్రిన్సిపాల్ టి. నాగమాధవి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

అగ్నిప్రమాద బాధితులకు లయన్స్ సభ్యుల సాయం

అమలాపురం రూరల్: కొత్తపేట మండలం బిళ్లకుర్రు గ్రామం తరిట్లవారి పేట చెందిన గోదా శ్రీనివాసరావు లక్ష్మి దంపతులకు చెందిన తాటాకిల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో దహనమైంది. బాధితులకు అమలాపురం లయన్స్ క్లబ్ తరపున 26 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సూదా గణపతి, కార్యదర్శి బెహరా వీర హనుమంతరావు, మాజీ అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు శుక్రవారం అమలాపురంలో అందించారు. సహాయ కార్యదర్శి సుగ్గు గోపాలకృష్ణ, క్లబ్ డైరెక్టర్ గుమ్మళ్ల అచ్యుత రామయ్య పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి

అమలాపురం టౌన్: అల్లవరం మండలం బోడసకుర్రులో నిర్మించి ఇచ్చిన టిడ్కో ఇళ్ల నివాసితులు మౌలిక వసతులు లేక తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. టిడ్కో ఇళ్ల సముదాయంతో తిష్టవేసిన సమస్యలను వివరిస్తూ సూర్యనారాయణమూర్తి మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌కు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. టిడ్కో ఇళ్ల వద్ద నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. వర్కర్స్ పార్టీ నాయకులు కొనుకు వెంకటేశ్వరరావు, ముసునూరి ఏసుబాబు పాల్గొన్నారు.

సైన్స్ సెమినార్‌లో విద్యార్థుల ప్రతిభ

అమలాపురం రూరల్: జిల్లాలో జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో క్వాంటం ఏజ్ బిగిన్స్ పొటెన్షియల్స్- సవాళ్లు అనే అంశంపై విద్యార్థులకు జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ ఇటీవల అమలాపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుండి 44 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇటీవల మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఈ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం పొందారు.ఈ పోటీల్లో అయినవిల్లి మండలం జగన్నాథపురం విద్యార్థిని ప్రథమ స్థానం, ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. విజేతలు రాష్ట్రస్థాయిలో జిల్లా తరపున పాల్గొంటారు. జిల్లా విద్యాశాఖ అధికారి సలీమ్ బాష, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో శుక్రవారం బహుమతులు అందించారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి గుబ్బల సూర్యప్రకాశం, పి. రామలక్ష్మి, మూర్తి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బీర హనుమంతరావు, సెక్టోరియల్ ఆఫీసర్లు పాల్గొన్నారు న్యాయనిర్ణేతలుగా ఏవీఎన్ నరసింహారావు, ఉప్పలపాటి మాచిరాజు, పీవీ బ్రహ్మానందం తదితరులు వ్యవహరించారు.


బహుమతులు పొందిన విద్యార్థులతో డీఈవో సలీమ్ బాష

కమ్యూనిటీ కళాశాల ఏర్పాటు

యానాం: పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో యానాంలో కమ్యూనిటీ కళాశాల ఏర్పాటుకు సన్నాహాలు కొనసాగుతున్నాయని శుక్రవారం పుదుచ్చేరి ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. కమ్యూనిటీ కళాశాలను తాత్కాలిక భవనంగా స్థానిక బీసీ వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. కరోనా తర్వాత విద్యార్థులెవరూ హాస్టల్లో చేరకపోవడంతో కొన్నేళ్లుగా ఆ భవనాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. శాశ్వత భవనానికి రెండెకరాల స్థలం కావాల్సి ఉందని, స్థల సమీకరణ చేస్తున్నట్లు పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్, తెలుగు వ్యక్తి ప్రకాష్‌బాబు తెలిపారు. అగ్రికల్చర్ మినీఫారం భూమిలో ఒక ఎకరం స్థలం ఇచ్చేందుకు ఇప్పటికే నిర్ణయించినట్లు తెలిపారు. కమ్యూనిటీ కళాశాల ద్వారా స్థానిక యువత ఒకేషనల్ డిగ్రీ కోర్సులు అభ్యసించవచ్చునని తెలిపారు. కార్డియాక్ ల్యాబ్ టెక్నాలజీ, ఆపరేషన్ థియేటర్, రేడియోగ్రఫీ, ఇమేజింగ్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ డవలప్‌మెంట్, టూరిజం, యూజీ, పీజీ కోర్సులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పాండిచ్చేరి యూనివర్సిటీ గవర్నింగ్ బాడీ మెంబర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

బ్యాంక్ రుణాలు సకాలంలో మంజూరు చేయాలి

అమలాపురం టౌన్: డ్వాక్రా సంఘాలకు రుణాలను ఆయా బ్యాంకర్లు సకాలంలో మంజూరు చేయాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) డి.పెంచలయ్య సూచించారు. అమలాపురం మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశంలో పీడీ పెంచలయ్య మాట్లాడారు. ఈ సమావేశానికి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కేశవవర్మ అధ్యక్షత వహించారు. మెప్మా ఐబీ ప్రతినిధి మోహన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ పలు సూచనలు చేశారు. టిడ్కో పర్యవేక్షణాధికారి డి.లలితకుమారి, బ్యాంక్‌ల కంట్రోలర్లు, బ్యాంక్ మేనేజర్లు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్లు ఉన్నారు.

నూతన కౌలు చట్టాన్ని రూపొందించాలి

తాళ్లరేవు: ప్రభుత్వం నూతన కౌలుచట్టాన్ని తక్షణమే రూపొందించాలని ఏపీ కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబుకు నాయకులు అందజేసారు. సంఘ జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు పాల్గొన్నారు.

ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేత

ఉప్పలగుప్తం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలికి అవసరమైన ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు గుడ్ సీడ్ ఫౌండేషన్, మిరాకిల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సమకూర్చారు. మండలంలోని గొల్లవిల్లికి చెందిన ఎలిపే మోహన్‌రావు భార్య ఎలిపే మంగాదేవికి ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అవసరం ఏర్పడటంతో స్పందించిన రమణారావు శుక్రవారం అమలాపురంలోని గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో ఫౌండేషన్ టీమ్ సభ్యులతో కలిసి ఆమె భర్త మోహన్‌రావుకు అందజేశారు. గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీప్రసాద్, పందిరి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథరావు మృతికి వైఎస్సార్ సీపీ నేతల సంతాపం

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన టింబర్ వ్యాపారి, ముమ్మిడివరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ చిన్నాన్న పొన్నాడ జగన్నాథరావు (69) అనారోగ్యంతో మృతి చెందారు. జగన్నాథరావు మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌తో పాటు అమలాపురం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ శుక్రవారం సందర్శించి సంతాపం తెలిపారు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులు జగన్నాథరావు కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్, దివంగత జగన్నాథరావు కుమారుడు కుమార్‌ను పార్టీ నాయకులు పరామర్శించారు.


జగన్నాథరావు మృతదేహాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్, శ్రీనివాసరావు

మహిషాసుర మర్దినీదేవికి సారె సమర్పణ

అమలాపురం టౌన్: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు ఏటా దసరా తర్వాత అక్కడి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి సారె సమర్పించే సంప్రదాయం ఉంది. అమలాపురం రవణం వీధిలోని మహిషాసుర మర్దినీదేవి అమ్మవారికి కూడా అదే మాదిరిగా సారె సమర్పించే విధానానికి ఈ ఏడాది నుంచి ఆలయ కమిటీ శ్రీకారం చుట్టింది. అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్ ఏటా అమ్మవారికి సారె సమర్పించే సంప్రదాయాన్ని పోలీసులు శుక్రవారం నుంచి ప్రారంభించారు. పట్టణ ఎస్సై ఎస్ఆర్ కిషోర్‌బాబు పోలీస్ స్టేషన్ తరపున సారెను సమర్పించారు. సారెను ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వరకూ తీసుకుని వెళ్లి అమ్మవారికి సమర్పించారు. అమలాపురం దసరా ఉత్సవాల ఊరేగింపుల్లో చెడీ తాలింఖానా ప్రదర్శనలు, దేవతా మూర్తుల వాహనాలతో భాగస్వామ్యమయ్యే ఏడు వీధుల్లో రవణం వీధి మహిషాసుర మర్దినీదేవి ఆలయ వాహనం ఒకటి. ఆలయ కమిటీ ప్రతినిధులు రవణం చిట్టిబాబు, చిక్కం కిట్టు, రవణం సుబ్బారావు, చిక్కం ప్రసాద్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు తదితరుల ఆధ్వర్యంలో అమ్మ వారికి సారె సమర్పించారు.


అమలాపురం మహిషాసుర మర్దినీదేవికి సారె సమర్పిస్తున్న పట్టణ ఎస్సై కిషోర్‌బాబు

సీజేఐ గవాయ్‌పై దాడి దారుణం

అమలాపురం రూరల్: భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి దారుణమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు మందా రామకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ వీఎస్ దివాకర్‌కు అందజేశారు. అమలాపురం రూరల్, పట్టణ, ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు చుట్టుగుళ్ల సత్తిబాబు, గంపల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి పాశవిక చర్య అని, దాడి వెనుక ఉన్న కుట్రదారులను వెలికి తీసి కఠినంగా శిక్షించి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గవాయ్‌పై దాడిని నిరసిస్తూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సత్తాల దుర్గారావు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. దాడి చేసిన న్యాయవాదిని అరెస్టు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ జి.లలితకు నాయకులు అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు విజయ్‌కుమార్, వంగలపూడి నరసింహమూర్తి, ఉందుర్తి సంజీవ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన

అల్లవరం: సీజేఐపై దాడికి పాల్పడిన న్యాయవాదిని అరెస్టు చేయాలని అల్లవరం మండలం ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యార్లగడ్డ రామకృష్ణ తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావుకు వినతిపత్రం అందించారు.